ప్రజాశక్తి
శుక్రవారం 14 ఏప్రిల్ 2023



వేగంగా రీసర్వే ప్రక్రియ

విజయనగరం : జిల్లాలో రీ సర్వే ప్రక్రియను వేగంగా పూర్తి చేస్తున్నామని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జిల్లాలో చేపడుతున్న రీ సర్వే ప్రక్రియను రాష్ట్ర భూ పరిపాలన కమిషనర్ జి.సాయిప్రసాదుకు వివరించారు. గురువారం విజయవాడలోని సిసిఎల్ఎ కార్యాలయం నుంచి, రాష్ట్రంలో చేపడుతున్న రీసర్వే ప్రగతిపై కమిషనరు జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా మొదటి దశలో రీ సర్వే పూర్తి చేసిన గ్రామాలలో వెబ్‌ల్యాండ్ ప్రగతి, పాస్ పుస్తకాలు ప్రింటింగ్, హద్దురాళ్ళు పాతడం, జిసిపి మార్కింగ్, చెకింగ్ పాయింట్స్ గుర్తింపు, డ్రోన్ ఫ్లయింగ్, గ్రౌండ్ ట్రూతింగ్ నోటీసుల పంపిణీ, సెక్షన్ (13) నోటిఫికేషన్ల ప్రగతి తదితర అంశాలలో కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో మొదటి దశ రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లో హద్దురాళ్ల పాతడం, ఖాతాలకు ఫొటో మ్యాపింగ్ తదితర ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జెసి మయూర్ అశోక్, డిఆర్ఒ ఎం.గణపతిరావు, సర్వే శాఖ ఎడి త్రివిక్రమరావు, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం పేరు వినగానే వలసలు, వర్షాధార పంటలు, చాలా రంగాల్లో వెనుకబాటు తనం, అత్యంత చిన్న జిల్లా... ఇటువంటి విషయాలు గుర్తుకు వస్తాయి. కానీ, ఇదంతా ఒకప్పటి మాట. జిల్లాల పునర్విభజన అనంతరం విజయనగరం పెద్ద జిల్లాల సరసన చేరింది. ఉపాధి హామీ పనులతో వలస కుటుంబాల సంఖ్య కొంతలో కొంతైనా తగ్గింది. వెనుకబాటు తనం నుంచి ఇప్పుడిప్పుడు గట్టెక్కుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో జిల్లా అభివృద్ధిపై మనసుపెడితే ప్రగతి దారులే. అందుకు అవసరమైన వనరులు మాత్రం పుష్కలంగా ఉన్నాయి. అంతకు మించి కష్టపడి పనిచేసే మనస్థత్వంగల ప్రజానీకం ఉంది. ఈ నేపథ్యంలో కొత్త కలెక్టర్‌గా కొలువుదీరిన నాగలక్ష్మి సెల్వరాజన్‌పై జిల్లా ప్రజానీకం ఆశలు పెరుగుతున్నాయి. అభివృద్ధి అనేది ప్రభుత్వ విధానాలపై ఆధారపడి ఉంటుంది. అంతకన్నా జిల్లా సర్వోన్నత అధికారిగా కలెక్టర్ చొరవ కూడా అత్యంత కీలకంగా ఉంటుంది.

బొబ్బిలి గ్రోత్‌సెంటర్‌లో పరిశ్రమ

- వ్యవసాయ అనుబంధ రంగాలే కీలకం
- కొదవ లేనన్ని నదులు, గెడ్డలు
- ప్రతిపాదనలకే పరిమితమైన మినీ జలాశయాలు
- ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ఎన్నో అవకాశాలు
- పర్యాటకరంగ అభివృద్ధికి అపార వనరులు

మనసు పెడితే ప్రగతిదారులే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో వ్యవసాయ రంగం అత్యంత కీలకమైనది. 80 శాతం ప్రజానీకం దానిపైనే ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తోంది. కానీ, అందుకు తగ్గట్టు సాగునీటి వనరులు లేవు. తోటపల్లి జలాశయం లక్ష్యానికి అనుగుణంగా సాగునీరు అందించలేకపోతోంది. చంపావతి, వేగావతి, గోస్తనీ, నాగావళి వంటి ఎన్నో నదులు ఉన్నాయి. వీటిపై మినీ రిజర్వాయర్లు నిర్మించాలన్న ప్రతిపాదన ఎప్పటినుంచో ఉంది. ఆండ్ర, పెద్దగెడ్డ, తాటిపూడి తదితర జలాశయాలు ఆధునీకరణ నత్తనడకన సాగడం వల్ల శివారు ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. గుర్లగెడ్డ అసంపూర్తిగా ఉండిపోయింది. ఏడొంపుల గెడ్డ, పోతుల గెడ్డ వంటి ఎన్నో జీవ గెడ్డలు జిల్లాలో ఉన్నాయి. వీటన్నింటిపైనా చిన్నచిన్న చెక్‌డ్యాములు నిర్మించినా సాగునీరు పుష్కలమే. వీటిపై పెద్దగా దృష్టిపెట్టకపోవడం వల్ల పంటలన్నీ వర్షాధారంగానే సాగుచేయాల్సిన దుస్థితి దాపురిస్తోంది. దీంతో, వ్యవసాయ రంగం ద్వారా జిల్లాకు కేవలం రూ.13,343 కోట్ల (41.2శాతం) ఆదాయం మాత్రమే వస్తోంది. ఈ ప్రభావం రైతులతోపాటు వ్యవసాయ రంగంపై ఆధారపడిన కార్మికులు, వృత్తిదారులపైనా పడింది. అయినప్పటికీ నేలతల్లిని నమ్ముకున్న రైతులంతా వరి, చెరకు, మొక్కజొన్న, పత్తి, అరటి, మినుములు, పెసలు, తదితర అపరాలు వంటి వ్యవసాయ పంటలు సాగుచేస్తూ జీవనం వెల్లదీస్తున్నారు. కూరగాయలు కూడా విస్తారంగా సాగవుతాయి. మామిడి సాగులో రాష్ట్రంలో మన జిల్లా మూడో స్థానంలో ఉంది. వీటన్నింటికీ మార్కెట్ సదుపాయాలు లేకపోవడంతో రైతులు దళారుల బారినపడక తప్పడం లేదు. ఈ వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటల ఆధారంగా వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన చాలా కాలంగా ఉంది. ఇప్పటికైనా దృష్టిపెడితే రైతులకు భద్రత కలగడంతోపాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి.

పర్యాటక రంగంలో అవకాశాలెన్నో..!

ఓవైపు సముద్ర తీరం, మరోవైపు గిరిజన ప్రాంత, మైదాన ప్రాంతాల్లో జలాశయాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉంది. ముఖ్యంగా చింతపల్లి బీచ్‌ను పర్యాటక హబ్‌గా రూపుదిద్దేందుకు పుష్కలమైన అవకాశాలు ఉన్నాయి. పర్యాటకుల సౌకర్యార్థం ఇప్పటికే అక్కడ రిసార్ట్ ఏర్పాటుచేశారు. ఆ దరిదాపుల్లోని లైట్ హౌస్ రారమ్మంటున్నట్టుగా కనిపిస్తుంది. తాటిపూడి, ఆండ్ర జలాశయాల్లో బోట్లు ఏర్పాటు చేసి ప్యాకేజీ పద్ధతిలో పర్యాటకులను ఆకర్షించవచ్చు. గతంతో పోలిస్తే జిల్లాకు రోడ్డు కనెక్టివిటీ, కమ్యూనికేషన్ కూడా పెరిగింది. తద్వారా పర్యాటకులను ఆకట్టుకుని సేవారంగంలో పురోగతి సాధించవచ్చు. విజయనగరం కవులు, కళాకారులు, సాహితీకుసుమాలు, క్రీడాకారులకు పుట్టినిల్లు. కలియుగ భీముడు కోడిరామ్మూర్తి బలప్రదర్శనశాల మొదలుకుని మహాకవి గురజాడ స్వగృహం, సర్ విజ్జీ స్టేడియం, రాజీవ్ స్టేడియం, ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల తలమానికంగా నిలిచాయి. ఈ రంగాలపై దృష్టిపెట్టడం ద్వారా విజయనగర వైభవానికి ప్రాధాన్యత ఇచ్చినట్టుగా ఉంటుంది. వీటన్నింటిపైనా కొంతమంది దృష్టిపెట్టడం వల్లే జిల్లాలో కొంతలో కొంతైనా అభివృద్ధి సాధించింది. ఈ నేపథ్యంలో నూతన రథసారథిగా బాధ్యతలు స్వీకరించిన నాగలక్ష్మి మరింత ముందుకు తీసుకెళ్తారని జిల్లా ప్రజానీకం ఆశిస్తోంది.

పారిశ్రామిక అభివృద్ధికి చొరవ చూపితే..

ఒకప్పుడు జ్యూట్ మిల్లులకు విజయనగరం జిల్లా పెట్టిందిపేరు. 20 మిల్లుల వరకు ఉండేవి. ప్రభుత్వ విధానాల వల్ల జిల్లాలో ప్రస్తుతం నాలుగైదుకు మించి తిరగడం లేదు. ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలకు చెంతనే ముడిసరుకు ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, సహకారం కొరవడడంతో ఇప్పటికే ఉన్న పరిశ్రమలు ఉనికి కోల్పోవాల్సి వస్తోంది. పూసపాటిరేగ ప్రాంతంలో అరకొర పరిశ్రమలు మినహా ఇంకేమీ చెప్పుకోదగ్గవేవీ లేవు. ఉన్న కొద్దిపాటి పరిశ్రమల మూత వల్ల వేలాది మంది ఉపాధి కోల్పోవడంతో ఆయా కుటుంబాలవారి ఆర్థిక స్థితిగతులు దెబ్బతిన్నాయి. జిల్లాకు వస్తున్న వార్షిక ఆదాయంలో పారిశ్రామిక రంగం ద్వారా వస్తున్న ఆదాయం ఏటా తగ్గిపోవడం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. 2017-18లో 19.3 శాతంకాగా, 2018-19లో 17.6 శాతానికి తగ్గింది. 2019-20 నాటికి అది 15.9 శాతానికి పడిపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో పారిశ్రామికాభివృద్ధికి చొరవ చూపాల్సి ఉంది. కలెక్టర్‌గా పెద్దపెద్ద పరిశ్రమలు పెట్టేందుకు అవకాశం లేకపోవచ్చు. పంటల ప్రాధాన్యతలను బట్టి ఆయా ప్రాంతాల్లో కలెక్టర్ స్థాయిలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు ప్రయత్నిస్తే రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు నిరుద్యోగ సమస్యను అధిగమించవచ్చు.

తాటిపూడి రిజర్వాయర్

ఆరు వరుసల రహదారి

చింతపల్లి బీచ్

మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

జట్టుగా పనిచేద్దాం.. ఫలితాలు సాధిద్దాం

- అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- ఇ-ఆఫీసులోనే ఫైళ్లను పంపించాలి
- జిల్లా అధికారుల సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని ప్రభుత్వ శాఖల మధ్య ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమల్లో అత్యుత్తమ సమన్వయం ఉండాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమం ఏదైనా పలు శాఖలు ఒక జట్టుగా పనిచేస్తేనే విజయవంతం అవుతాయని, ఆశించిన ఫలితాలు సాధించగలమని చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులు తమ శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఇతర విభాగాలతో సమన్వయంగా పనిచేసి కార్యక్రమాలు అమలు చేసేలా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం గురువారం కలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులతో సమావేశమయ్యారు. జిల్లాలో పరిపాలన పరమైన అంశాల్లో ఏవిధంగా వ్యవహరించాలనే అంశంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

అధికారులు సమయపాలన పాటించాలని, సమావేశాలకు నిర్దేశించిన సమయానికి హాజరుకావాలని కలెక్టర్ స్పష్టంచేశారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించి ఎదురయ్యే కోర్టు కేసుల్లో అధికారులు సకాలంలో తగిన విధంగా కౌంటర్లు దాఖలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. చివరి నిమిషం వరకు కౌంటర్లు దాఖలు చేయకుండా నిర్లక్ష్యంగా వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇ-ఆఫీసు విధానంలో వచ్చిన ఫైళ్లనే పరిశీలిస్తామని స్పష్టంచేశారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతిరావు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీకర్, జిల్లా అటవీ అధికారి ఎస్.వెంకటేష్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టెన్నిస్‌లో సత్తాచాటిన వెటరన్ క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖపట్నం సెంచరీ క్లబ్‌లో జరిగిన జాతీయ టెన్నిస్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. 45 ఏళ్ల వయసు కేటగిరీలో సింగిల్స్ విభాగం ఫైనల్‌లో హైదరాబాద్ ఆటగాడు డి.సతీష్‌పై జిల్లాకు చెందిన టి.రామారావు మూడు సెట్లలో రెండు సెట్లు గెలిచి విజేతగా నిలిచారు. డబుల్స్ విభాగంలో టి.రామారావు, ఎంఎల్ఎన్ రాజు ద్వితీయ స్థానం సాధించారు. మరో కేటగిరీలో డబుల్స్‌లో మహారాష్ట్రకు చెందిన బడే, తింబాడియ జంటపై జిల్లాకు చెందిన సుదర్శనరాజు, భానుచంద్రుడు విజయం సాధించి మొదటి స్థానంలో నిలిచారు.

సాధించిన పతకాలతో వెటరన్ క్రీడాకారులు

సైన్స్ పరీక్షకు 99.84 శాతం హాజరు

చీపురుపల్లి హైస్కూల్‌లో విద్యార్థి డిబార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో గురువారం జరిగిన పదో తరగతి సైన్స్ పరీక్షకు 99.84 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 24,076 మందికి 24,039 మంది హాజరయ్యారు. 37 మంది గైర్హాజరయ్యారు. ప్రయివేటు విద్యార్థులు 1406 మందికి గాను 1346 మంది హాజరయ్యారు. 60 మంది గైర్హాజరయ్యారు. చీపురుపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఒక విద్యార్థి చూసిరాతకు పాల్పడటంతో డిబార్ చేసినట్లు డిఇఒ లింగేశ్వరరెడ్డి తెలిపారు. మిగిలిన అన్ని చోట్లా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు చెప్పారు.

కళాశాల స్థలం ఆక్రమణకు యత్నం

అడ్డుకున్న సర్పంచ్, ప్రిన్సిపల్

ఫెన్సింగ్ స్తంభాలను తొలగిస్తున్న సర్పంచ్ సీతారాం

పూసపాటిరేగలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నించారు. విద్యాభివృద్ధి కోసం కళాశాలకు తండ్రి ఇచ్చిన భూమి కోసం కుమారులు కక్కుర్తి పడుతున్నారు. భూములకు ధరలు రావడంతో యథేచ్ఛగా కళాశాల భూమిలో ఫెన్సింగ్ వేసి కబ్జాకు పాల్పడటం చర్చనీయాంశమైంది. ఆక్రమణ ప్రయత్నాలను కళాశాల ప్రిన్సిపల్, స్థానిక సర్పంచ్ అడ్డుకున్నారు. ఇదే విషయమై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు జిల్లా కలెక్టర్‌కూ ఫిర్యాదు చేశారు.

ప్రజాశక్తి - పూసపాటిరేగ

పూసపాటిరేగలో జూనియర్ కళాశాల కోసం 1984లో 10.02 ఎకరాల భూమిని తిరుమలరాజు వెంకట సీతారామరాజు దాన పట్టాగా ఇచ్చారు. ఆ స్థలంలో కళాశాల భవనాలు నిర్మించారు. ప్రస్తుతం ఆయన పెద్ద కుమారుడు ఆ స్థలం తమదేనంటూ, రికార్డులలో తమ పేర్లే ఉన్నాయంటూ ఆక్రమణకు పాల్పడేందుకు సిద్ధపడుతున్నారు. ఒక అడుగు ముందుకేసి కొంత మందితో కళాశాల ప్రాంగణంలో రెండు రోజుల క్రితం ఫెన్సింగ్ వేయించారు. విషయం తెలుసుకున్న కళాశాల ప్రిన్సిపల్ నగేష్‌కుమార్‌తో పాటు సర్పంచ్ టొంపల సీతారాం.. రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. కళాశాల స్థలంలో వేసిన పెన్సింగ్ పోల్స్ వెంటనే తొలగించేయాలని చెప్పడంతో గురువారం సర్పంచి ఆ పెన్సింగ్ పోల్స్‌ను తొలగించేందుకు ప్రయత్నం చేస్తుండగా, కొంత మంది అడ్డుకున్నారు. 'కళాశాల భూమి కదా మీకెందుకు' అంటూ సర్పంచ్‌పై రుసరుసలాడారు. వెంటనే సర్పంచ్ స్పందించి తహశీల్దార్ ఇమంది భాస్కరరావుకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి తహశీల్దార్ భాస్కరరావు చేరుకున్నారు. ఇంతలో ఆక్రమణకు పాల్పడిన వారు జారుకున్నారు. ఈ స్థలం రికార్డులు పరిశీలిస్తే కళాశాల పేరిట ఉన్నాయి. దీంతో ఈ స్థలం కళాశాలకు చెందినదని బోర్డు పెట్టేందుకు సిద్ధం చేస్తున్నారు. భూమి ధరలు పెరగడంతో ఆక్రమణకు పాల్పడుతున్నారని అధికారులు తెలిపారు. ఇప్పటికే డిగ్రీ కళాశాలకు ఇచ్చిన స్థలం, అందులో నిర్మాణాన్ని ఈ వ్యక్తే ఆక్రమించుకొన్నారని సర్పంచ్ సీతారాం గుర్తుచేశారు. ఆ స్థలాలు అమ్ముకొని, నిర్మాణాన్ని కళ్యాణ మండపంగా వాడుతున్నారని తెలిపారు. సంబంధిత వ్యక్తి ఇటీవల దళితుల భూమి కూడా ఆక్రమణ పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. గతంలో ఆయన అమ్మిన భూములపైనా సబ్‌రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు.

కలెక్టర్‌కు ఎస్ఎఫ్ఐ ఫిర్యాదు

విజయనగరంటౌన్ : పూసపాటిరేగ జూనియర్ కళాశాల స్థలాన్ని కొంతమంది ఆక్రమణకు పాల్పడుతున్నారని, దానిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ నాగలక్ష్మికి వినతి అందించారు. ఆక్రమణకు చేస్తున్న ప్రయత్నాలను ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి జె.రవికుమార్.. కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ వెంటనే స్పందిస్తూ స్థలాన్ని తిరిగి కళాశాలకు అందించే విధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకటేష్, కేంద్ర కమిటీ సభ్యులు సిహెచ్ పావని, జిల్లా కమిటీ సభ్యులు సతీష్, దేవ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు

ఎయిర్‌పోర్టు ఎప్పటికి పూర్తిచేస్తారో?

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరంకోట

భోగాపురం ఎయిర్‌పోర్టుకు మళ్లీ శంకుస్థాపన చేస్తామని ప్రకటించారని, కానీ ఎప్పటికి పూర్తి చేస్తారో స్పష్టత లేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజు వ్యాఖ్యానించారు. గురువారం స్థానిక అశోక్ బంగ్లాలో టిడిపి విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో అశోక్ మాట్లాడుతూ భోగాపురం ఎయిర్‌పోర్టు విషయం భలే గమ్మత్తుగా తయారైందన్నారు. గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసినా, మళ్లీ వైసిపి ప్రభుత్వం ఎందుకు ఉవ్విళ్లూరుతోందని నిలదీశారు. ఎయిర్‌పోర్టుకు కేటాయించిన భూముల్లో 500 ఎకరాలు తగ్గించి, ఎకరానికి రూ.కోటి చొప్పున మిగిల్చామని చెబుతున్నారని తెలిపారు. భూముల కేటాయింపు తగ్గించి, ఎయిర్‌పోర్టు ప్రణాళికల్లో ఎక్కడ కోత పెట్టారో బహిర్గతం చేయడం లేదని చెప్పారు. గోవా, భోగాపురం ఎయిర్‌పోర్టుల కాంట్రాక్టులను జిఎంఆర్ సంస్థ తీసుకుందని గుర్తుచేశారు. గోవా విమానాశ్రయం ఇప్పటికే సిద్ధంగా ఉందని, భోగాపురం ఎయిర్‌పోర్టును మాత్రం ఇక్కడి పాలకులు శంకుస్థాపనలతో కాలం వెల్లదీస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర విభజన చట్టం మరో ఏడాది మాత్రమే అమల్లో ఉంటుందని, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, హామీల అమలు గురించి ఏమైనా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందా? అని ప్రశ్నించారు. ఈ విషయం గురించి నాటి పిసిసి అధ్యక్షులు, ప్రస్తుత మంత్రి బొత్స సత్యనారాయణకు తెలియదా? అన్నారు. విభజన చట్టంలోని హామీల గురించి కేంద్రాన్ని అడిగే ధైర్యం ఈ ప్రభుత్వానికి లేదని తెగేసిచెప్పారు. ఈ సమావేశంలో మాజీమంత్రి కె.కళావెంకటరావు, మాజీ సభాపతి ప్రతిభా భారతి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

3న భోగాపురం విమానాశ్రయానికి శంకుస్థాపన

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మే మూడో తేదిన భోగాపురం ఎయిర్‌పోర్టుకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ గజపతిరాజు, మాజీ మంత్రి కళా వెంకటరావు చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ప్రభుత్వం పేద ప్రజలకు అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు.. ప్రజలకు అవాస్తవాలు చెప్పి మభ్యపెట్టాలని చూస్తున్నాయన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన చేయడంపాటు మరో 30 నెలల్లో ప్రారంభోత్సవం చేయబోయేది కూడా సిఎం జగనేనని తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా గత ప్రభుత్వం గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు 2,700 ఎకరాలను కేటాయించి ఒప్పందం కుదుర్చుకుంటే.. తమ ప్రభుత్వం అదే సంస్థతో అదే అగ్రిమెంట్‌ను కేవలం 2,200 ఎకరాలతోనే పూర్తిచేసి, గతేడాది పౌరవిమాన యాన సంస్థ నుంచి అనుమతులు తీసుకొచ్చినట్లు వివరించారు. గత ప్రభుత్వంలో కేంద్ర పౌరవిమానయాన మంత్రిగా ఉండి అశోక్ గజపతిరాజు ఎయిర్‌పోర్ట్ శంకుస్థాపనకు రాకపోవడానికి గల కారణాలు చెప్పాలని డిమాండ్‌చేవారు. దాదాపు కోర్టులో 150 పైగా కేసులు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసులు, ఎయిర్‌పోర్టుకు కనీసం నీటి సౌకర్యం, భూములు కోల్పోయిన రైతులకు పునరావాసం ఏర్పాటు చేయకుండానే శంకుస్థాపన ఎలా చేస్తారని ప్రశ్నించారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక సుమారు 400 మంది రైతులకు రూ.78 కోట్లు ఖర్చు చేసి, పునరావాసం, ఇతర మౌలిక వసతులు ఏర్పాటు చేశామని తెలిపారు. మాజీ మంత్రి కళా వెంకట్రావు తోటపల్లి ప్రాజెక్టు కోసం మాట్లాడడం చాలా విడ్డూరమన్నారు. సమావేశంలో వైసిపి జిల్లా నాయకులు కె.వి.సూర్యనారాయణ రాజు, చనుముల రమణ పాల్గొన్నారు.

శంకుస్థాపన ఏర్పాట్లపై సమీక్ష

విజయనగరం : భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి మే 3న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి గురువారం జిల్లా అధికారులు, జిఎంఆర్ ప్రతినిధులతో కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. భూసేకరణ, నిర్వాసితుల పునరావాసం తదితర అంశాలపై ఇప్పటివరకు జరిగిన ప్రగతిని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్.. కలెక్టర్‌కు వివరించారు. భూసేకరణ దాదాపుగా పూర్తయ్యిందని, పునరావాసం కూడా పూర్తిచేసి కుటుంబాలను తరలించామని ఆయన తెలిపారు. 3న శంకుస్థాపనకు జిఎంఆర్ సంస్థ ద్వారా చేయనున్న ఏర్పాట్లపై సంస్థ ప్రాజెక్టు హెడ్ రామరాజు వివరించారు. సమావేశంలో ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ, భోగాపురం తహశీల్దార్ కె.శ్రీనివాసరావు, ఆర్అండ్‌బి ఇఇ రమణ తదితరులు పాల్గొన్నారు.

18న గజపతినగరంలో సిజిఆర్‌ఎఫ్ సదస్సు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమహేంద్రవరం, ఏలూరు సర్కిళ్లలో వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సదస్సులు నిర్వహిస్తున్నామని విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సిజిఆర్ఎఫ్) చైర్ పర్సన్, విశ్రాంతి జడ్జి బి.సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ఈ నెల 18న గజపతినగరం సబ్ డివిజన్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వినియోగదారుల అవగాహన సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చు తగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, పేరు మార్పిడి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం, ట్రాన్స్ ఫార్మర్ల మార్పిడి, తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు. విశాఖపట్నంలోని సీతమ్మధారలో ఎపిఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సిజిఆర్ఎఫ్ కార్యాలయంలో పోస్టల్ ద్వారా గానీ, వ్యక్తిగతంగా గానీ ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ఆహార కమిషన్ తనిఖీలు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణం, మండలంలో గురువారం రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు విస్తృతంగా పర్యటించారు. అంగన్వాడీలు, పాఠశాలలు, రేషన్ డిపోలు, ఎంఎల్ఎస్ పాయింట్ గోదాము, ప్రభుత్వ వసతిగృహాల్లో తనిఖీలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో కోడిగుడ్ల బరువు (ట్రేతో కలిపి) 1530 గ్రాములు ఉండాలని, అనేక చోట్ల చాలా తక్కువగా బరువు ఉంటున్న విషయం తనిఖీలో తేలిందన్నారు. కాంట్రాక్టరుతో ఫోన్‌లో మాట్లాడితే, ఆయన సమాధానం సంతృప్తికరంగా లేదన్నారు. దీనిపై తొలుత జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని, ఆ తరువాత కమిషన్ సమావేశంలో చర్చిస్తానని చెప్పారు. పట్టణంలోని కొత్త ఎరుకలివీధిలోని రెండు అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు రిజిష్టర్‌లో ఖాళీలు చూపడంతో వారికి మెమోలు జారీ చేశామన్నారు. నేతాజీ ప్రభుత్వ పాఠశాల భోజన రికార్డులు సక్రమంగా లేకపోవడంతో హెచ్ఎంకు మెమోలు జారీ చేసినట్లు చెప్పారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ నిల్వ గణాంకాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని తెలిపారు. దీనిపై జెసికి విచారణ నిర్వహించాలని కోరుతూ లేఖ రాస్తామన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్‌లో తనిఖీ చేస్తున్న ఆహార కమిషన్ సభ్యులు

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలో వివిధ డివిజన్లలో రూ.64 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి గురువారం ప్రారంభించారు. ఐదో డివిజన్ బాబామెట్టలో దేవి పార్కు ప్రాంతంలో, 44వ డివిజన్ అయ్యన్నపేట ప్రాంతంలో, 45వ డివిజన్లోనూ, 49వ డివిజన్ గాజులరేగలో కొండపల్లి వారి తోట, రాళ్లమాలపల్లి ప్రాంతాలలో అభివృద్ధి పనులను ప్రారంభించి ప్రజా వినియోగంలోకి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతిదేవి, వైసిపి జోనల్ ఇన్‌ఛార్జులు తమ్ము, కోలగట్ల కృష్ణారావు, దూబే, బొద్దాన అప్పారావు, కార్పొరేటర్లు టి.సంతోషికుమారి, శైలాడ ఈశ్వరమ్మ, గాదం మురళి, వైసిపి నాయకులు కెవిపి రాజు, సైలాడ సత్యనారాయణ, తాళ్లపూడి పండు, లెంక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వింత వ్యాధితో పందులు మృతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పంది కళేబరాన్ని తరలిస్తున్న కార్మికులు

నగరంలో కొద్ది రోజులుగా పందులు వింత వ్యాధితో మరణిస్తున్నాయి. నాలుగు కాళ్లూ కొట్టుకుంటూ చని పోతున్నాయి. కాలువల్లో, పొదల్లో పందుల కళేబరాలు పురుగులు పట్టి, దుర్వాసన రావడంతో ఆ మార్గంలో వెళ్లలేని దుస్థితి నెలకొంది. నగరంలో ప్రతిరోజూ పదుల సంఖ్యలో చనిపోతుండటంతో వాటిని తొలగించేందుకు మున్సిపల్ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య పని కంటే చనిపోతున్న పందులను తరలించడం మున్సిపల్ కార్మికులకు పెద్ద పనిగా మారింది. రక్షణ పరికరాలే లేకపోవడంతో పందులను తరలిస్తున్న కార్మికులు తమకు ఎటువంటి అనారోగ్య సమస్యలు వస్తాయోనని భయపడుతున్నారు. ఇదే విషయంపై కమిషనర్‌ని ప్రశ్నిస్తే గత కొద్ది రోజులుగా పందులు చనిపోతుండటం వాస్తవమేనని తెలిపారు. కార్మికులు ఎప్పటికప్పుడు వాటిని తీసివేసి కాలువలు, రోడ్లు శుభ్రం చేస్తున్నారని చెప్పారు.

ప్రచార భేరీ పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ను ఆవిష్కరిస్తున్న సిపిఎం, సిపిఐ నాయకులు

రాజాం : కేంద్ర బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక, నిరంకుశ విధానాలపై ఈ నెల 14 నుంచి 30 వరకు జరగనున్న ప్రచార భేరీ పోస్టర్ను సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్య నారాయణ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ గురువారం ఆర్టిసి కాంప్లెక్స్ కూడలిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడీని గద్దె దింప దేశాన్ని కాపాడాలనే నినాదంతో ఈ ప్రచార భేరీ చేపడుతున్నామన్నారు. బిజెపి మతోన్మాద, కార్పొరేట్ అనుకూల ప్రజావ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలన్నారు. ఈ ప్రచార భేరీలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వార్షిక ప్రణాళికను రూపొందించండి

శృంగవరపుకోట : జిల్లాలో శుక్రవారం నుంచి జరగబోయే గ్రామ సభలలో ప్రజలతో చర్చించి వాటిపై వార్షిక ప్రణాళికను రూపొందించాలని లోక్సత్తా పార్టీ జిల్లా కార్యదర్శి కాండ్రేగుల ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2023– 24 ఆర్థిక సంవత్సరం మొదటి గ్రామ సభ కావడంతో అధికారులు ప్రాధాన్యత కల్పించి సచివాలయ సిబ్బందితో కాకుండా మండల స్థాయి అధికారులు పాల్గొని ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. రీసర్వే జరుగుతున్న గ్రామాలలో రైతులకి అవగాహన కల్పించి దీర్ఘకాలిక భూతగాదాలను పరిష్కరించే దిశగా ప్రయత్నం చేయాలని ఆయన అన్నారు. గ్రామాల్లో సౌకర్యాలపై దృష్టి పెట్టాలని అధ్వానంగా ఉన్న రోడ్లు, కాలువలను శుభ్రపర్చాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు కె. నాగేశ్వరరావు, కె. రామలక్ష్మి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలి

బొబ్బిలి: విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపాలని ప్రజా సంఘాల నాయకులు, జిల్లా రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మణనాయుడు, కాంగ్రెస్ పిసిసి మెంబర్ మొవ్వలు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని జెండా మాల్ సెంటర్లో గురువారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ని 1982లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 33 వేల ఎకరాలలో స్టీల్ ప్లాంట్ నిర్మించి లక్షలాదిమంది కార్మికులకు ఉద్యోగ ఉపాధిని కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. ఎంతో మంది ప్రాణాలు అర్పించి సాధించుకున్న స్టీల్ ప్లాంట్ని ప్రైవేటు వ్యక్తుల పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధపడటం దారుణమన్నారు.

మల్లంపేటను సందర్శించిన చైర్మన్

బొబ్బిలి : పట్టణంలోని మల్లంపేట గ్రామ దేవత కొత్త పోలమ్మతల్లి అమ్మవారి పండగ సందర్భంగా మల్లంపేట గ్రామాన్ని మున్సిపల్ చైర్మన్ మురళీ కృష్ణ గురువారం సందర్శించారు. పండగ సందర్భంగా డ్రైనేజీలలో పూడిక తియ్యాలని, రోడ్లు పరిశుభ్రంగా ఉంచాలని శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. పండగ మూడు రోజులు తాగునీటి సదుపాయం అంతరాయం కలగకుండా ఉండాలని, అమ్మ వారిని దర్శించడానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా డ్రైనేజీలపై స్లాబ్ కల్వర్ట్ వేయాలని ఇంజనీరింగ్ విభాగానికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస రావు, కౌన్సిలర్స్ ఇంటి గోవింద, తెంటు పార్వతి, కొర్లాపు రామారావు, మున్సిపల్, సచివాలయం సిబ్బంది, వైసిపి నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అలరించిన థింసా నృత్యాలు

థింసా నృత్యం చేస్తున్న మహిళలు

శృంగవరపు కోట: ఇటీవల కాలంలో స్కూల్స్, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రైవేట్ కార్యక్రమాలు, శుభకార్యాలకు గిరిజన సాంప్రదాయ థింసా నృత్యాలు వేదికగా మారుతున్నాయి. అందులో భాగంగా పట్టణంలోని శ్రీనివాస కాలనీలో గురువారం సాయంత్రం అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం కోనాపురం భారతి ట్రూప్ నిర్వహించిన గిరిజన థింసా నృత్యం స్థానికులను అలరించింది. పట్టణంలోని ఒక వివాహ కార్యక్రమానికి హాజరైన ఈ ట్రూప్ కాలనీ ప్రజల కోరిక మేరకు నృత్యం చేసి ఆకట్టుకున్నారు.

'సంక్షేమం కొనసాగాలంటే జగనన్నే మళ్లీ రావాలి'

శృంగవరపుకోట : సంక్షేమం కొనసాగాలంటే జగనన్న పాలనే మళ్లీ రావాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. గురువారం మండలంలోని కిల్తంపాలెం గ్రామ పంచాయితీ కొత్తపాలెం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలు మళ్లీ జగన్ పాలన కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, మాజీ ఎంపిపి ఒంటి అప్పారావు, సర్పంచ్ సుంకరి ఈశ్వరరావు, వైస్ సర్పంచ్ రాము, వార్డు సభ్యులు ఎడ్ల అర్జున, ఎడ్ల నాయుడు, సచివాలయ కన్వీనర్ ఇందుకూరి శివప్రసాద్ వర్మ, నాయకులు సుంకరి బుల్లి, గృహసారధులు సుంకరి వెంకట రామసత్యం, బంగారు రమణమ్మ, గుగ్గి రాము పాల్గొన్నారు.

ఆస్పత్రికి మంచాలు వితరణ

రేగిడి/రాజాం : రాజాం మండలం పొగిరి కుష్టి వ్యాధి ఆసుపత్రికి శ్రీకాకుళం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో లక్ష రూపాయిల విలువ చేసే 10 ఇనుప మంచాలు గురువారం వితరణగా అందజేశారు. ఆ ఆస్పత్రిలో ఉంటున్న రోగులు మంచాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర వైస్ చైర్మన్, శ్రీకాకుళం జిల్లా శాఖ చైర్మన్ పి. జగన్మోహన్రావు, రాజాం రెడ్ క్రాస్ చైర్మన్ కొత్త సాయి ప్రశాంత్ కుమార్, జాతీయ యువజన అవార్డ్ గ్రహీత పెంకి చైతన్య కుమార్, రెడ్ క్రాస్ సొసైటీ కోఆర్డినేటర్ సత్యనారాయణ అందజేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని అన్నారు. ఉల్లకుల నీలకంఠ యాదవ్, దాసరి అమర్ నాథ్, హాస్పిటల్ వైద్యులు డాక్టర్ లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐదో తరగతిలో ప్రవేశాలకు 16న పరీక్ష

లక్కవరపుకోట : మహాత్మా గాంధీ జ్యోతిబాపూలే బాలికల ఆశ్రమ పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాలకు జమ్మాదేవిపేట సమీపంలో ఉన్న ఆ పాఠశాలలో ఈనెల 16న పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పాత్రో గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుండి 12 గంటల వరకు జరగనున్న ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థి ఆన్లైన్లో హాల్ టికెట్ డౌన్లోడ్ చేసుకుని నీలం, లేదా నలుపు పెన్నుతో అరగంట ముందుగా హాజరు కావాలని తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్లు తీసుకురాకూడదని స్పష్టం చేశారు.

ముగిసిన కెమ్వెర్స్-2023 సింపోజియం

డెంకాడ : చింతవలస ఎంవిజిఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులు నిర్వహించిన కెమ్వెర్స్ –2023 నేషనల్ టెక్నికల్ స్టూడెంట్ సింపోజియం గురువారంతో ముగిసింది. కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు అనేక ఉద్యోగవకాశాలున్నాయని పలువురు వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఎక్స్ప్లోజివ్స్ కంట్రోలర్ బి. రవి కుమార్, శ్రీవేద కన్సల్టెన్సీ సిఇఒ చైతన్య వర్మ, సహ భాగస్వామి రాము నాయుడు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎంసి శేఖర్, కన్వీనర్ ప్రొఫ్ బి.సర్వారావు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువు ఒక్కటే అన్నింటికీ పరిష్కారం

విజయనగరం కోట : చదువు ఒక్కటే అన్నింటికీ పరిష్కారమని నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మొయిద నారాయణరావు తెలిపారు. స్థానిక గాజులరేగలోని నారాయణ పబ్లిక్ స్కూల్లో అంబేద్కర్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా శ్రీనివాస ఆర్ట్స్ అకాడమీ, నారాయణ పబ్లిక్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు నివాళులు అర్పించారు. అనంతరం అకాడమీ కార్యదర్శి రామానాయుడు మాట్లాడుతూ సమాజంలో పేరుకుపోయిన అంటరానితనం నిర్మూలనకు అంబేద్కర్ విశేషమైన కృషి చేశారని తెలిపారు. అంబేద్కర్పై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలైన విద్యార్థులకు పుస్తకాలు బహూకరించారు.

తాగునీటి సమస్య పరిష్కారించాలని ధర్నా

బొబ్బిలిరూరల్ : మండలంలోని కొండదేవుపల్లి గ్రామంలో తాగు నీటి సమస్య పరిష్కరించాలని బిజెపి నాయకులు మరిచర్ల రామారావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆ గ్రామ మహిళలతో ఆయన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగు నీటి సమస్య పరిష్కరించకపోతే ఉన్నతాధికారులు ఫిర్యాదు చేస్తామన్నారు.

జూనియర్ కళాశాల ఏర్పాటు కలేనా..?

● స్థలం సేకరించినా మంజూరు కాని కళాశాల ●ఉన్నత విద్యకు రాజాం, పాలకొండ, శ్రీకాకుళం వెళ్లాల్సిన పరిస్థితి ●ఇంటర్ విద్యకు దూరమవుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - రేగిడి

నాడు నేడులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి చర్యలు తీసుకోవడంతో పాటు పాఠశాలలు, కళాశాలలకు నూతన భవనాల నిర్మాణానికి కృషి చేస్తోంది. అధికారుల నిర్లక్ష్యానికి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు కలగానే మిగిలింది. 2012– 13లో ప్రభుత్వం ఇక్కడ కళాశాల మంజూరుకు సర్వే నిర్వహించి సేకరించిన నివేదికలు ఆధారంగా జూనియర్ కళాశాల అవసరమని గుర్తించి, కళాశాలకు కావలసిన స్థలాన్ని ఉంగరాడ మెట్ట వద్ద సేకరించారు. అయితే నాటి నుంచి నేటి వరకు అధికారులు పట్టించుకునే దాఖలాలు లేవు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ఇదే ఏడాదిలో మూడు చోట్ల జూనియర్ కళాశాలలకు అధికారులు ప్రతిపాదనలు పంపించగా గంగువారి సిగడాం, నందిగాం మండలాలకు కళాశాలలు మంజూరు చేయటంతో పాటు పక్క భవనాలు నిర్మాణాలు కూడా పూర్తి ప్రతిపాదించిన చేపట్టారు. కానీ రేగిడి కళాశాల మాట మాత్రం ఊసేలేకపోవడం దురదృష్టకరం.

ఉంగరాడ మెట్ట వద్ద గతంలో కళాశాల కోసం సేకరించిన స్థలం ఇదే

మండలంలోని 39 పంచాయతీల్లో 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలలకు చెందిన 521 మంది విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. ఏటా మండలంలో పదో తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ఇక్కడ ఇంటర్ విద్య లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. ఇంటర్ విద్య కోసం పాలకొండ, రాజాం, శ్రీకాకుళం ఆతర పట్టణాలకు వ్యయ ప్రయాసాలతో వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవటంతో పాటు మానసికంగా కూడా కొంత ఒత్తిడికి గురవుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే స్తోమత లేని విద్యార్థులు మధ్యలోనే చదువు నిలిపివేస్తున్నారు. దీంతో డ్రాప్ అవుట్స్ గానే మిగిలిపోతున్నారు. విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని అధికారులు ఇంటర్ కళాశాల మంజూరుకు కృషి చేయాలని పలు గ్రామాల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.

కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వ చర్యలు తీసుకోవాలి. మారుమూల గ్రామాల నుంచి ఇంటర్ విద్య చదివేందుకు పట్టణాలకు వెళ్లవలసిన పరిస్థితి నెలకొంది. పట్టణాలకు ఇంటర్ విద్య చదువుకునేందుకు వెళ్లాలంటే బస్సు సౌకర్యం తక్కువగా ఉంది. అలాగే ఆర్థిక ఇబ్బందులు తోడవడంతో చదువు మధ్యలోనే ఆపేయాల్సిన పరిస్థితి ఉంది.

కోన పవిత్ర, విద్యార్థి సంకిలి.

మంత్రి దృష్టికి తీసుకెళ్తా

మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలన్నది ఎప్పటినుంచో ప్రయత్నిస్తున్నాం. ఇప్పటికి అనేక పర్యాయాలు జిల్లా అధికారులకు విన్నవించాం. ఇటీవల నియోజకవర్గం ఎమ్మెల్యే ఎమ్మెల్సీ దృష్టికి కూడా తీసుకెళ్లాం. సానుకూలంగా స్పందించారు. గత ప్రభుత్వ హయంలో ఉంగరాడ మెట్ట వద్ద వందగా పేట గ్రామం వద్ద స్థల సేకరణ చేశారు. ఇంతవరకు కళాశాల మంజూరు కాలేదు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్తాం.

వావిలపల్లి జగన్మోహన్ రావు, వైస్ ఎంపిపి, రేగిడి.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థల సేకరణ

జూనియర్ కళాశాల మంజూరుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థల సేకరణ చేపడతాం. గతంలో సేకరించిన స్థలంలో జగనన్న ఇంటి నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పుడు మరో చోట స్థల సేకరణ చేస్తాం. ఈ విషయంలో ఇంతవరకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. వచ్చిన వెంటనే స్థల సేకరణ చేసి, నివేదికలు తయారు చేసి అందిస్తాం.

టి. కళ్యాణ చక్రవర్తి, తహసిల్దార్, రేగిడి.

పారదర్శకంగా డిఎస్సి అభ్యర్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎన్నికలు, పాదయాత్ర హామీలను అమలు చేసేందుకు పారదర్శకంగా 98 డిఎస్సి అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చినట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1998 డిఎస్సి అభ్యర్థులకు పారదర్శకంగా కౌన్సిలింగ్ చేసి మెరిట్ ఆధారంగా ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇచ్చినట్లు చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి మాట నిలబెట్టుకున్నారన్నారు. హామీలను అమలు చేయడంతో టిడిపి నేతలు మోహం ఎక్కడ పెట్టుకోవాలో తెలియడం లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారన్నారు. ప్రజలను అడిగి మరి స్టిక్కర్లు అతికిస్తే ఇల్లు అద్దెకు ఇచ్చారా అని అనడం విడ్డూరంగా ఉందన్నారు. టిడిపి హయాంలో ఎన్టిఆర్, చంద్రబాబు ఫొటోలతో ప్రచారం చేశారన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు దిగజారుడు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. లోకేష్ పాదయాత్రతో టిడిపికి నష్టమన్నారు. లోపాలను ఎత్తి చూపితే సరి చేసుకుంటామని, తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలే బుద్ధి చెపుతారన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, జెసిఎస్ పట్టణ కన్వీనర్ రేజేటి విస్సు ఉన్నారు.

నియామక పత్రాలు అందజేత

రేగిడి : మండల కేంద్రంలో ఎంఆర్సి కార్యాలయంలో 1998 డిఎస్కి ఎంపికైన ఆరుగురులో ఐదుగురికి జాయినింగ్ అయ్యేందుకు నియామక పత్రాలు మండల విద్యాశాఖ అధికారి ఎం వరప్రసాదరావు గురువారం అందజేశారు. ఆయా మండలాల్లో ఉపాధ్యాయులుగా జాయినింగ్ ఆర్డర్స్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇందులో భాగంగా కొండవలస మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలకు తుమ్మి వెంకటరమణ, సంకిలి మండల పరిషత్ పాఠశాలకు కొప్పర సతీష్ కుమార్, అప్పికొండ శ్రీనివాసరావు, ఉణుకూరు మండల పరిషత్ పాఠశాలకు బొత్స గజేంద్రనాయుడు, మునకలవలస మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల చోడవరపు బాబురావులకు నియామక పత్రం అందజేసినట్లు తెలిపారు. ఎంఆర్సి సిబ్బంది సూర్యారావు, అప్పలనాయుడు, ఉపాధ్యాయులు ఉన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన

ప్రజాశక్తి- డెంకాడ

మండల కేంద్రంలో రైతులకు గురువారం భూసార పరీక్షల ప్రాముఖ్యతపై వ్యవసాయాధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎడిఎ నాగభూషణరావు మాట్లాడుతూ భూమి మొక్కలకు కావాల్సిన పోషకాలను అందిస్తూ మొక్క పెరుగుదలకు ప్రధాన పాత్ర వహిస్తోందన్నారు. రైతులు కూడా ఏ నెలలో ఏ పంట వేస్తే మంచి దిగుబడి వస్తుందో అధికారులను సంప్రదిస్తే మేలన్నారు. వేసిన పంటకు నేలలో తగు నిష్పత్తిలో పోషకాలు లేనపుడు భూసార పరీక్ష ద్వారా నేలలో ఏ పోషకాలు తగ్గినాయో ఆ పోషకాలను మాత్రమే నేలకు అందించడం వల్ల పంట మంచి దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు, విఎఎ, ఎంపిఇఒ, ఎఇఒలు పాల్గొన్నారు.

మట్టి నమూనా సేకరణ వేగవంతం చేయాలి

రామభద్రపురం: మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో మట్టి నమూనా సేకరణ వేగవంతం చేయాలని స్థానిక వ్యవసాయ అధికారి వెంకటయ్య ఆదేశించారు. మట్టి నమూనా వారోత్సవాలలో భాగంగా ఈ నెల 10 నుంచి 16లోగా అందరి రైతుల వ్యవసాయ భూముల్లో మట్టి నమూనాల సేకరణ జరిపి వాటిని పరీక్షలకు పంపి వాటి పలితాలు రైతులకు అందజేయాలని సూచించారు. వీటి నమూనా సేకరణ, పరీక్ష జరిపే విధానం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విఎఎ, విహెచ్ఏలు పాల్గొన్నారు.

డెంకాడ: అవగాహన కల్పిస్తున్న ఎడిఎ

లింకు రోడ్డు పనులు చేపట్టండి

ప్రజాశక్తి - గుర్ల

కొండగండ్రేడు ఆర్ అండ్ బి రోడ్కు 30 మీటర్ల దూరంలో లింక్ రోడ్ పనులు ఆపేశారు. దీంతో 14 గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో గూడెం వయా గోవుపేట నుండి కొండగండ్రేడు ఆర్ అండ్బి రోడ్ వరకు బిటి రోడ్డును 2020–21లో సుమారు రూ. 2కోట్లతో మంజూరు కాగా సదరు కాంట్రాక్టరు రోడ్డు పనులను చేపట్టారు. రోడ్డు పని పూర్తి కావస్తున్నా సమయంలో కొండగండ్రేడు ఆర్అండ్బి రోడ్డు బ్రిడ్జి సమీపంలో 30 మీటర్ల దూరం రోడ్డు పనులను ఆపివేశారు. స్థలసేకరణ విషయంలో వివాదాలు తలెత్తడంతో రోడ్డు పనులు జరగలేదు. ఈ రోడ్డు మార్గంలో పల్లిగండ్రేడు, కొండగండ్రేడు, ముద్దాడపేట, పకీరుకిట్టాలి, దేవునికనపాక, గ్రామాలతో పాటు మరోపది గ్రామాల ప్రజలు నిత్యం ఈ రహదారి పై ప్రయాణం చేస్తారు. ఆయా గ్రామల నుండి గుర్ల మండలానికి చేరుకోవడానికి ఈ రోడ్డును వెళ్తే సుమారు 8 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని ఆయా గ్రామల ప్రజలు అంచనా. ఆర్అండ్బి రోడ్డు దగ్గర మలుపు తిరిగే ప్రదేశం కావడం, అక్కడ తారు రోడ్డు వేయక పోవడం వాహన దారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం కొట్లాది రూపాయిలు ఖర్చు పెట్టినా ప్రజలకు పూర్తి స్థాయిలో రోడ్డు సదుపాయం కలగ లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ రోడ్డును పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎడమ పక్కన ఉన్న లింకు రోడ్డునే అభివృద్ధి చేయాల్సి ఉంది..

బొబ్బిలిలో గడపగడపకు..

బొబ్బిలి : బొబ్బిలి 5వ సచివాలయం పరిధిలోని పదో వార్డులో గురువారం సాయంత్రి ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి తన రెండు కళ్ళుగా భావిస్తూ కుల, మత, పార్టీలు బేధం లేకుండా పారదర్శకంగా పాలన సాగిస్తున్న జగన్మోహన్ రెడ్డికి ప్రజలంతా అండగా ఉండాలన్నారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం మూడేళ్లలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు గురించి వివరించారు. మరోసారి జగన్మోహన్రెడ్డిని గెలిపించి సంక్షేమ పథకాలు కొనసాగించేలా చూడాలని కోరారు. అనంతరం బ్రోచర్లను అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీ కృష్ణారావు, మండల పార్టీ అధ్యకులు శంబంగి వేణుగోపాలనాయుడు, బుడా ప్రతినిధి ఇంటి గోపాలరావు, వార్డు ఇంఛార్జ్ తుట్ట తిరుపతి, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, ప్రభుత్వ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, పట్టణ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జెడ్పిటిసి చాంబర్ ఏర్పాటుపై విమర్శలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

ఎంపిడిఒ కార్యాలయంలో ప్రత్యేకంగా జెడ్పిటిసికి చాంబర్ ఏర్పాటుపై పలువురు విమర్శిస్తున్నారు. ఎంపిడిఒ కార్యాలయం అనగానే ఎంపిడిఒ, వారి దిగువ స్థాయి సిబ్బందితో పాటు ఎంపిపికి గదులు (ఆఫీస్) కేటాయిస్తారు. కానీ ఇక్కడ ఎంపిడిఒ కార్యాలయంలో జెడ్పిటిసికి కూడా ప్రత్యేక గది ఉండాలనే ఉద్దేశంతో రెండు గదులను ఒక గదిగా తీర్చిదిద్దేందుకు ప్రజాధనాన్ని వృధా చేస్తూ పనులు చేపట్టారని మరో వర్గం నాయకులు ఆరోపిస్తున్నారు. ఆ పనులు కూడా ఏ నిధుల నుండి చేపడుతున్నారో తెలియని ప్రశ్న. ఏదైనా ప్రభుత్వ కార్యాలయ నిర్మాణ పనులు చేయవలసి వస్తే పని అంచనా విలువతో టెండర్ వేసి చేయాల్సి ఉంది. కానీ ఇక్కడ అందుకు భిన్నంగా ఎటువంటి ఆదేశాలు లేకుండా రహస్యంగా నిర్మాణ పనులు చేపడుతున్నారు. గత ఎంపిడిఒ కె రూపేష్ హాయంలో జెడ్పిటిసికి కార్యాలయం కొరకు ప్రత్యేక గదిని కేటాయించాలని అధికార పార్టీ నాయకుల నుండి ఒత్తిళ్లు వచ్చినప్పటికీ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని భావించి ఆయన నిరాకరించారు. ఆయన ఆరు నెలల పాటు శిక్షణకు వెళ్లడంతో ఆయన స్థానంలో ఇఒపిఆర్డిగా విధులు నిర్వహిస్తున్న జ్ఞానేశ్వరరావుకు ఇటీవల ఎంపిడిఒ బాధ్యతలు అప్పగించారు. దీంతో జెడ్పిటిసికి ఎంపిడిఒ కార్యాలయంలో ప్రత్యేక గదిని కేటాయించేందుకు జిల్లా అధికారుల అనుమతులు లేకుండా ఎంపిడిఒ జ్ఞానేశ్వరరావు ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. ఈయన ఇష్టానుసార వ్యవహారంపై కొత్తగా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

ఓట్ల తనిఖీపై దృష్టి సారించాలి

భోగాపురం : ఓట్ల వెరిఫికేషన్పై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని నియోజకవర్గ అబ్జర్వర్ ఎల్ఎల్ నాయుడు అన్నారు. నియోజకవర్గానికి సంబంధించి పార్టీ కార్యక్రమాలు, ఇదేంకర్మ – మన రాష్ట్రానికి, రచ్చబండ, ఓటరు వెరిఫికేషన్ పై ముఖ్య నాయకులతో నియోజకవర్గ ఇన్చార్జి కర్రోతు బంగార్రాజు అధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖరరావు, పుసపాటిరేగ టిడిపి మండల అధ్యక్షులు మహంతి శంకర్రావు, పార్లమెంట్ అధికార ప్రతినిధి గేదెల రాజారావు, నాయకులు బైరెడ్డి లీలావతి, దంగా భూలోక, సమంతుల సొంబాబు, దాసరి అప్పలస్వామి, పిడుగు తోటరావు, పోతల రాజప్పన్న, వెంపాడపు సూర్యనారాయణ, ఇజ్జోరోతు ఈశ్వరరావు, అట్టాడ శ్రీధర్, నల్లం శ్రీను, నీలపు అప్పల రామిరెడ్డి, కోరాడ తాతరావు, కర్రోతు రాజు, చందక ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నిషేధిత పదార్థాలు రవాణా చేస్తే చర్యలు

బొబ్బిలి : నిషేధిత పదార్థాలు వాహనాల్లో రవాణా చేస్తు కఠిన చర్యలు తీసుకుంటామని బొబ్బిలి స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సిఐ ఆర్. జైభీమ్ అన్నారు. మండలంలోని జగన్నాధపురం రోడ్ పై గురువారం ఆయన వాహన తనిఖీ నిర్వహించారు. నాటుసారా, మద్యం, గంజాయి, ఇతర డ్రగ్స్ లాంటి నిషేధిత పదార్థాలు రవాణాను అడ్డుకునేందుకు ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పేడాడ గ్రామంలో గురువారం అంబేద్కర్ విగ్రహాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ ఆవిష్కరించారు. ఆయన సొంత డబ్బులతో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తన పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సి సెల్ చైర్మన్ గోక త్రినాధ్, భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండల అధ్యక్షులు వాకాడ లక్ష్మణరావు, డి గురువులు, తెలుగు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో...

శృంగవరపుకోట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిహెచ్. కేశవరావు మాట్లాడుతూ దళిత, నిమ్న, అట్టడుగు వర్గాల వారు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి అంబేద్కర్ చేసిన కృషి భారత రాజ్యాంగ నిర్మాతగా ఎదిగిన స్థాయి, రిజర్వేషన్ రూపకల్పన గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఎం. రమేష్ కుమార్, కళాశాల అధ్యాపకులు వాసు దేవరావు, వలీ ఖాన్, ఈరన్న, భాస్కర్, శ్రీలక్ష్మి, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

సీతంలో ....

విజయనగరం: స్థానిక సీతం ఇంజనీరింగ్ కళాశాలలో బిఆర్ అంబేద్కర్ జయంతి సభను గురువారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కళాశాల గ్రంథాలయ అధికారి డాక్టర్ లెంక సత్యవతి మాట్లాడుతూ అంబేద్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నవ, సమ సమాజ నిర్మాణానికి సమిష్టిగా కృషి చేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఎన్నో ఇబ్బందులను, వివక్షతను, పేదరికాన్ని ఎదుర్కొంటూనే దేశ విదేశాలలో అత్యున్నత విద్యను అభ్యసించి, డాక్టరేట్ పట్టానందుకొని, భారత రాజ్యాంగాన్ని ప్రగతి పట్టాలెక్కించిన అంబేద్కర్ చిరస్మరణీయుడు, ఆరాధ్యనీయుడు అని కొనియాడారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ అంబేద్కర్ దీక్షను స్వీకరించి ఆచరించిన ప్రతి విద్యార్థి ఒక ఉత్తమ వ్యక్తిగా మాత్రమే కాక అత్యున్నత శక్తిగా ఎదగగలరని తెలిపారు. ఈ సభలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి.రామమూర్తి, అధ్యాపకులు, ఇతర సిబ్బంది, విద్యార్థులు అంబేద్కర్ చిత్రపటానికి పూలదండలతో నివాళులర్పించారు.

ప్రజలపై విద్యుత్తు ఛార్జీల భారం

గుర్ల : ప్రజలపై వైసిపి ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీల భారం వేస్తోందని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి కిమిడి నాగార్జున అన్నారు. మండల కేంద్రంలో గురువారం రాత్రి ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ పరిపాలన గాలికి వదిలేసి వ్యక్తిగత ప్రయోజనాలు కోసమే వైసిపి నాయకులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో ఇసుక, అక్రమ రవాణాకు అడ్డు అదుపు లేదన్నారు. జాబ్ కేలండర్ పేరు చెప్పి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. మూడు రాజధానిల పేరు చెప్పి ప్రజలను అయోమయంలో పడేసిన ఘనుడు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి వెన్ని సన్యాసి నాయుడు, జిల్లా టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి కిరణ్ కుమార్, మండల అధ్యక్షులు చనమల్ల మహేశ్వర రావు, ఉపాధ్యక్షులు కిలారి సూర్యనారాయణ, ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షులు నాగులపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కొండ గంగుపూడి ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ జి. శ్రీదేవి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించి విద్యార్థులు హాజరు పట్టికను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు సులభతరంగా విద్యాబోధన అందించాలన్నారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె తెలిపారు.

కలెక్టర్ నాగలక్ష్మికి శుభాకాంక్షలు

నెల్లిమర్ల : నూతన కలెక్టర్గా బాధ్యతలు చేపట్టిన నాగలక్ష్మి సెల్వరాజ్కు సెంచూరియన్ విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి. ఎస్ఎన్ రాజు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఆమెను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయం గురించి కొద్ది సేపు ముచ్చటించారు.

పెట్రోల్ దొంగల హల్చల్

శృంగవరపుకోట: గత కొన్నేళ్లుగా పట్టణంలోని శ్రీనివాస కాలనీలో పెట్రోల్ దొంగల ఆగడాలు మితిమీరుతున్నాయి. మత్తు పదార్థాలకు అలవాటుపడ్డ కొందరు యువకులు రాత్రి వేళలో ఇంటిముందు ఉంచిన ద్విచక్ర వాహనాలలో పెట్రోలు దొంగలించి విక్రయించగా వచ్చిన డబ్బులతో మత్తు పానీయాలు సేవించి వీధుల్లో హల్చల్ చేస్తున్నారు. రాత్రివేళ వీధుల్లో పెట్రోలింగ్కు వచ్చే పోలీసుల జాడ కానరాకపోవడంతో వీరి ఆగడాలు మరింత పెరిగాయి. కొన్ని సందర్భాలలో రాత్రివేళ వీధిలైట్ల సరఫరాను ఆపి మరీ దుండగులు ఈ దుశ్చర్యలకు పాల్పడుతుండడం గమనార్హం. ఇకనైనా పోలీస్ అధికారులు స్పందించి రాత్రి వేళల్లో శ్రీనివాస కాలనీలో పెట్రోలింగ్ నిర్వహించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

బొబ్బిలిలో అగ్నిప్రమాదం

బొబ్బిలి : పట్టణంలోని సింగారపువీధిలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో పతివాడ తిరుపతి ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఇంటిలో ఉన్న గ్యాస్ సిలెండర్ పేలిపోయింది. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక అధికారులు వచ్చి మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు చెపుతున్నారు. ఇంటిలో ఉన్న రూ.40వేలు నగదు, కుమార్తె టెన్త్, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు దగ్ధమయ్యాయి. 12 దాన్యం బస్తాలు, నిత్యావసర సరుకులు, దుస్తులు, వంట సామగ్రి పూర్తిగా కాలిపోవడంతో తిరుపతి కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మృతదేహాన్ని పరిశీలిస్తున్నఎస్ఐ

డెంకాడ : మండలంలోని రఘుమండ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగి వ్యక్తి మృతి చెందాడని ఎస్ఐ మహేష్ తెలిపారు. బుధవారం రాత్రి పూసపాటిరేగ మండలం పిట్టపేట గ్రామానికి చెందిన పిట్ట పైడ్రాజు (32) బొడ్డవలసలో జరిగే పండక్కి వచ్చి తిరిగి మోటార్ సైకిల్పై తన స్వగ్రామం వెళ్తుండగా రఘు మండ సమీపంలోకి వచ్చేసరికి మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న గెడ్డలో పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు తెలిపామని, మృతుని తండ్రి అప్పన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

25 కిలోల గంజాయి స్వాధీనం

శృంగవరపుకోట : పట్టణంలోని ఆర్టిసి కాంప్లెక్స్ ఎదుట విశాఖ–అరకు ప్రధాన రహదారి పక్కన రెండు బ్యాగుల్లో ఉన్న 25కిలోల గంజాయిని పోలీసులు మంగళవారం రాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్.ఐ తారకేశ్వరరావు గురువారం తెలిపారు. పట్టణములోని ఆర్టిసి కాంప్లెక్స్ పరిసరాలలో విశాఖ అరకు రోడ్డు పక్కన అనుమానాస్పదంగా రెండు బ్యాగులు ఉన్నాయన్న సమాచారంతో వెళ్లి వాటిని పరిశీలించగా 25 కిలోల గంజాయి లభించిందని ఆ బ్యాగులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

గడ్డి వాములు దగ్ధం

భోగాపురం: భోగాపురం పంచాయతీ అప్పన్న పేట గ్రామంలో గురువారం 4 ఎకరాల గడ్డి వాము అగ్నికి ఆహుతైంది. అప్పన్న పేట గ్రామానికి చెందిన పెంటుమని సూరికి చెందిన గడ్డి వాము నుండి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గ్రామస్తులు మంటలు ఆర్పడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. దాదాపుగా గడ్డి కాలిపోవడంతో బాధితుడు సూరి లబోదిబోమంటున్నారు. పశువులకు సంవత్సరానికి సరిపడా గడ్డిని సమకూర్చుకున్నానని అది కాస్త కాలిపోయిందని ఆవేదన చెందాడు. విఆర్ఓ రామునాయుడు సంఘటన స్థలాన్ని పరిశీలించి నష్టాన్ని అంచనావేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

శృంగవరపుకోట : మండలంలోని బొడ్డవర గ్రామానికి చెందిన ఇందుకూరు నర్సింగరాజు (35) గత నెల 28వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదని ఆయన తండ్రి బాబ్జిరాజు గురువారం పోలీసుకలు ఫిర్యాదు చేశారు. మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు.